క్లుప్తంగా

తెలుగు క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంఅర్బన్: ఆర్యవైశ్య మహాసభ నూతన తెలుగు సంవత్సరం (2023–24) క్యాలెండర్లను ఎస్పీ వినీత్ సోమవారం ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలకు ముందుండేది ఆర్యవైశ్యులు అన్నారు. ఏడాదిగా జిల్లా ఆర్యవైశ్య మహాసభ ద్వారా విద్య, వైద్యం, శ్రీరామ నవమి, వైకుంఠ ఏకాదశి సందర్భంగా భద్రాచలం విచ్చేసే భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, కొత్తగూడెం పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పల్లపోతు సాయిబాబా, వ్యాపారులు మొరిశెట్టి భవాని ప్రసాద్, రేపాక రాజమనోహర్, కొదుమూరి శ్రీనివాసరావు, బండారు కృష్ణయ్య, చుంచుపల్లి మండల అధ్యక్షుడు తమ్మిశెట్టి రమేష్‌లు పాల్గొన్నారు.

మహిళా సమ్మాన్ సేవింగ్స్‌ను వినియోగించుకోండి

కొత్తగూడెంఅర్బన్: మహిళల కోసం భారత ప్రభుత్వం ప్రత్యేకంగా పోస్టాఫీసులో మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని కొత్తగూడెం పోస్టల్ ఏఎస్పీ రంజిత్‌కుమార్‌చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో కనీసం రూ.10,000 – రూ.200000 వరకు రెండేళ్లకు 7.5 వడ్డీ రేటుతో మహిళలు పొదుపు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాది తరువాత 40 శాతం తీసుకోవచ్చని పేర్కొన్నారు.

జనరిక్ మందులపై అవగాహన కల్పించండి

పాల్వంచరూరల్: జనరిక్ మందులపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించాలని దంతలబోరు ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీ సర్పంచ్ గద్దల రమేష్ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. సామాన్యులకు తక్కువ ధరలకు వివిధ మందులను అందించే లక్ష్యంతో కేంద్రం ప్రభుత్వం జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయించిందని వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన లేక వాటిని కొనుగోలు చేయడానికి సామాన్య ప్రజలు ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జనరిక్ మందుల వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కామేశ్

కొత్తగూడెంఅర్బన్: పేదవాళ్లు, ధనికులు అనే తారతమ్యం లేకుండా ఆకలికి అర్థం చెప్పేదే రంజాన్ మాసం అని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద రైల్వే మస్జిద్-ఏ-బైతునూర్ మసీదులో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కామేష్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. రోజా అంటే పేదవాడి ఆకలి తెలుసుకోవడమేనన్నారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, ఎండీ అమీర్‌ఖాద్రీ, ఎస్‌కే ఖాజాబాబా, ఎండీ యాసీన్, కరీమ్, ఎస్‌కే దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు ఇవ్వండి

సింగరేణి (కొత్తగూడెం): అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో సరుకులు సరఫరా చేయకుంటే కేంద్రాలను ఎలా నిర్వహిస్తారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సోమవారం బూడిదగడ్డ ఏరియాలో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ హెల్పర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ.. పప్పు, నూనె అందుబాటులో లేవని, గుడ్లు సకాలంలో సరఫరా కాకపోవడంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇంటి అద్దెలు, కూరగాయలు, గ్యాస్, స్టేషనరీ బిల్లులు అందక వడ్డీలకు తెచ్చి సెంటర్లను నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోనె మణి, ప్రమీల, నందిని, దేవి, టి.పద్మావతి, బాగ్యలక్ష్మి, రజిత, శ్రీదేవి, రాధ, ఎస్తేరు, రాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉపాధి శిక్షణ

- నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్) ఉచిత శిక్షణ – ఉపాధి కల్పన
- ఆసక్తి చూపని నిరుద్యోగులు



భవన నిర్మాణ రంగంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

ఇల్లెందు: వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గం చూపే వారున్నా .. నిరుద్యోగ యువతీయువకులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఉపాధి రంగాలు నిర్వీర్యమైపోతున్నాయి. గ్రామ స్థాయి నుంచి ఆసక్తి కలిగిన వారిని గుర్తించి కార్మిక శాఖ ద్వారా పేరు నమోదు చేసుకుని శిక్షణ ఇచ్చేందుకు అటు కార్మిక శాఖ , ఇటు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ప్రయత్నిస్తోంది. ఇల్లెందు కేంద్రంగా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ– ఉపాధి కల్పన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. 2022 ఆగస్టు 29న ఇల్లెందు కేంద్రంగా న్యాక్ శిక్షణ కేంద్రం నెలకొల్పారు. తెలంగాణ ప్రభుత్వంచే స్థాపించబడిన 'నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) సంస్థ'ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేని నిరుద్యోగ యువతీ, యువకులను చేరదీసి ఉచిత శిక్షణ ఇవ్వటం హర్షించదగిన విషయం. వేగంగా అభివృద్ధి చెందుతున్న నిర్మాణ రంగంలోని వివిధ రకాల వృత్తులలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది.

అందుబాటులో ఉన్న పలు ట్రేడ్‌లు ..

ఇల్లెందు కేంద్రంగా నాక్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో యువతకు ఉచిత శిక్షణ– ఉపాధి కల్పన అందిస్తోంది. పెయింటింగ్, మేషన్, బార్ బైండింగ్, ఎలక్ట్రీషియన్– హౌజ్‌వైరింగ్, జనరల్ వర్క్ సూపర్‌వైజర్, ప్లంబింగ్– శానిటేషన్ రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందజేస్తోంది. ఇప్పటి వరకు నిర్మాణ రంగం(మేషన్)లో ఉన్నవారు 8 బ్యాచ్‌ల్లో 112 మంది శిక్షణ పొందారు. ఎలక్ట్రీషియన్ హౌజ్ వైరింగ్‌లో మూడు బ్యాచ్‌ల్లో 52 మందికి శిక్షణ ఇచ్చారు. ఇక పెయింటింగ్, బార్ బైండింగ్, ప్లంబింగ్, శానిటేషన్‌కు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఇవే కాకుండా జనరల్ వర్క్ సూపర్‌వైజింగ్ (జీడబ్ల్యుఎస్), ల్యాండ్ సర్వేయర్ విభాగాలకు కూడా ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

శిక్షణ కార్యక్రమం ఇలా..

జనరల్ వర్క్ సూపర్‌వైజింగ్, ల్యాండ్ సర్వేయర్ విభాగాలకు మూడు నెలలు శిక్షణ ఉంటుంది. ఇక పెయింటింగ్, మేషన్, బార్ బైండింగ్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, శానిటేషన్ రంగాలకు మాత్రం 15 రోజులు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌కు 20 మందికి శిక్షణ ఇచ్చారు. వీరందరికీ ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు రూ.300 స్కాలర్‌షిప్ చెల్లించారు. శిక్షణ తీసుకుంటున్న వారికి ప్రతిరోజూ భోజనం, రెండుసార్లు టీ, బుక్, పెన్, టీ-షర్ట్, హెల్మెట్, బ్యాగ్ అందజేస్తున్నారు. ప్రతిరోజూ మూడు దఫాలు బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక కార్మిక శాఖ ద్వారా రిజిష్టర్ అయిన వారికే శిక్షణకు అవకాశం ఉంటుంది. అభ్యర్థులు 18 – 35 ఏళ్ల లోపువారు, 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకున్న వారికి ఉచిత శిక్షణ పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మేషన్ విభాగంలో 50 మంది, ఎలక్ట్రీషియన్ విభాగంలో 19 మంది శిక్షణ పొందుతున్నారు.

శిక్షణ ఉపయోగపడుతుంది



ఎలక్ట్రీషియన్ రంగంలో తాను పొందిన శిక్షణ ఎంతో ఉపయోగపడింది. ఇప్పటికే తాను ఎలక్ట్రీషియన్ రంగంలో కొంత పని నేర్చుకున్నాను. అయితే ఏ సంస్థ వద్ద కూడా పద్ధతి ప్రకారం శిక్షణ తీసుకోలేదు. అంతేగాక నాక్ సంస్థ ఇచ్చే ధ్రువపత్రం కూడా ఉపయోగపడుతుంది. ఈ శిక్షణ ముందుముందు ఉపయోగపడుతుంది.

– జి. శ్రీను, ఎలక్ట్రీషియన్ శిక్షణ అభ్యర్థి, ఇల్లెందు

ఉపాధి లభిస్తుంది



మేషన్ రంగంలో పని వచ్చినప్పటికీ సంస్థ ద్వారా శిక్షణ తీసుకున్నాను. దీని వల్ల ఇటు ఉపాధి రంగంలోనూ, అటు ఆయా కన్‌స్ట్రక్షన్ సంస్థలు పని కల్పించేందుకు శిక్షణ, ధ్రువపత్రాలు ఉపయోగపడుతాయి. 15 రోజుల పాటు పొందిన శిక్షణ ఎంతో ఉపయోగపడింది. యువత ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి.

– బొర్రా రమేష్, శిక్షణ అభ్యర్థి, ఇల్లెందు

నైపుణ్యాభివృద్ధి అవసరం..



ఏదో ఒక రంగంలో స్థిరపడాలనుకునే వారు ఎక్కడో ఒకచోట పనిలో చేరతారు. కానీ నైపుణ్యాభివృద్ధి ఉండదు. ఫలితంగా సరైన ఉపాధి లభించదు. తద్వారా ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయి. యువత స్కిల్ డవలప్‌మెంట్ మీద దృష్టి సారించాలి. ఏదో ఒకటి ఎంచుకుని శిక్షణ పొందాలి.

– కె.ప్రభాకర్, సీనియర్ డిమాన్‌స్ట్రేటర్, నాక్ శిక్షణ కేంద్రం, ఇల్లెందు

సినిమా థియేటర్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు

పాల్వంచ: దసరా సినిమాలోని సన్నివేశాలు అంగన్‌వాడీ సిబ్బంది మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని, తక్షణం వాటిని తొలగించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కన్వీనర్ సత్య మాట్లాడుతూ.. దసరా సినిమాలో హీరోయిన్ అంగన్‌వాడీగా పాత్ర ఉందని, కోడిగుడ్లు దొంగతనం చేస్తున్నట్లు సన్నివేశం చిత్రీకరించి అంగన్‌వాడీల మనోభావాలు దెబ్బతినే విధంగా చేశారన్నారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, మాతా, శిశు మరణాలతో పాటు, పోషకాహార లోపాన్ని అరికట్టడంతో అంగన్‌వాడీ ఉద్యోగుల కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో పండగ వెంకటరమణ, రాజ్యలక్ష్మి, రమ్య, భాను, లక్ష్మి, రేష్మ, రామలక్ష్మి, భవాని, విజయకుమారి, వెంకటరమణ, ప్రసన్న, లక్ష్మీకుమారి, మౌలాబి, జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఐక్యంగా పోరాడుదాం..



మాట్లాడుతున్న ఐలయ్య

పాల్వంచ: ఇళ్ల స్థలాలు సాధించే వరకు పేదలంతా ఐక్యంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. సోమవారం స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలో సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లుగా ఇళ్ల స్థలాలు కావాలని, డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని అనేకసార్లు వినతిపత్రాలు అందించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అనివార్యంగా ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేశ్ మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ పేరుతో కొందరు భూములు తీసుకుని పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి దొడ్డా రవికుమార్, వాణి, సత్య, రహీం, కాంతి, మాధవి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చెప్పండి



మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

టేకులపల్లి: రాబోయే ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జ్ ఏనుగుల రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని సీనియర్ నేత చిక్కా వెంకటేశ్వర్లు నివాసం వద్ద ఏర్పాటు చేసిన బూత్ కమిటీ సభ్యులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో పార్టీ అభివృద్ధికి పాటుపడాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. టీఆర్‌ఎస్ నియంత పాలన, వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధరావత్ బాలాజీనాయక్, బలగాని గోపి, గుగులోత్ రాంచందర్, స్వాతి, వి.హత్తీరాం, చిక్కా వెంకటేశ్వర్లు, మంగ్యా, రమేష్, రాహుల్, సూరి, సురేష్, వీరస్వామి, రాములు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జూలూరుపాడు: ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో కాకర్ల గ్రామంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఫ్రెండ్స్ యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాల రమేష్, ఉడతా సతీష్, గోపాల్‌రావు, పోలూరి కృష్ణ, నవీన్, స్థానికులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: బసవతారక కాలనీలో మీసేవ కేంద్రం సెంటర్‌లో సోమవారం పంచాయతీ సర్పంచ్ జరుపుల కాశమ్మ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి అజ్మీర రాంబాబు, ఉపసర్పంచ్ శ్రీను, వార్డు సభ్యులు, స్థానికులులు పాల్గొన్నారు.

ప్రణీతకు సీఈ అభినందనలు

పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల కోల్ ప్లాంట్‌లో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న ధరంసోత్ శివాజీ కుమార్తె ప్రణీత ఇటీవల గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో స్పారింగ్ విభాగంలో సిల్వర్, కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు సోమవారం స్థానిక సీఈ కార్యాలయంలో సీఈ ఎం.ప్రభాకర్‌రావు ప్రణీతను అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ భాగం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నార.

రోడ్డు పనులు ప్రారంభం

చుంచుపల్లి: 3 ఇంక్లైన్ గ్రామ పంచాయతీకి ఉపాధి హామీలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ ఆంగోతు మోతి ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా మంజూరవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు గ్రామంలో సమర్థవంతముగా అమలు చేస్తున్నట్లు చెప్పారు.

పశువుల తరలింపు అడ్డగింత

ఇల్లెందురూరల్: చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు 23 పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు. పశువులను తరలిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఖలీమ్, మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన మహేష్, శివలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



టేకులపల్లి పరీక్ష కేంద్రంలో..

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తనిఖీ చేసి లోపలికి పంపించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులు తనిఖీలు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: విద్యార్థులకు ఓఎంఆర్ షీట్లు అందజేస్తున్న ఇన్విజిలేటర్



సుజాతనగర్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం



పాల్వంచరూరల్: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు,



ఇల్లెందు: తనిఖీ చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెం నుంచి నేనే పోటీ చేస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికలు వస్తుండగానే బయలుదేరే పగటి వేషగాళ్లు అంతే త్వరగా వెళ్లిపోతారని.. అలాంటి వారి విషయంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సూచించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది తానేనని, గెలిచేది కూడా తానేనని ఆయన స్పష్టం చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి రామవరం పాత పోస్టాఫీస్ మైదానంలో సోమవారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తనకు అడ్డొచ్చే వారిని బిస్తర్ కట్టించి హైదరాబాద్ పంపిస్తామని చెప్పారు. కొత్తగూడెం ఎల్లలు తెలియని వారికి భంగపడక తప్పదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో కలహాలు, చీలికలు పెడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. వీలైతే 24 గంటలు రాజకీయాలు చేయండి లేదా 24 గంటలు ప్రజలకు అండగా ఉండాలే తప్ప రెండు పడవలపై కాళ్లు పెట్టి రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఎవరైనా ఎన్నికల వేళ వచ్చినా వారు వెళ్లక తప్పదని.. కానీ తాను మాత్రం లోకల్ అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇక ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో రాష్ట్రంలో పుష్కలంగా నీళ్లు ప్రవహిస్తుండగా.. నిధులు వస్తున్నాయని తెలిపారు. అలాగే, నియామకాలు కూడా జరుగుతున్నందున బీఆర్‌ఎస్ మూడో సారి విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మార్కెట్ చైర్మన్ భుక్యా రాంబాబుతో పాటు మండె వీరహనుమంతరావు, కాసుల వెంకట్, ఎం.ఏ.రజాక్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారుల అభివృద్ధి ఎంతైనా ఖర్చు చేస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు డీఎంఎఫ్, ఈజీఎస్ పథకాల్లో భాగంగా రామచంద్రునిపేటలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ఆమె ప్రారంభించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ పంచాయతీకి సీసీ రోడ్లు మంజూరు చేశారనే కృతజ్ఞతతో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మేళతాళాలతో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. ప్రజా అవసరాలను బట్టి సంక్షేమానికి పెద్దపీట వేసి అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బొమ్మెర్ల వరప్రసాద్, భూక్యా రాధ, చింత శాంతకుమారి, ఈసాల ఉపేంద్ర బాబు, ఇర్ప లక్ష్మీనారాయణ, బాణోతు విజయ, చీమల సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం..

సింగరేణి(కొత్తగూడెం): అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాదని పాలకులు మనుసంస్కృతిని తీసుకొస్తున్నారని, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) నాయకులు పేర్కొన్నారు. ఇఫ్టూ రాష్ట్ర రెండో మహాసభ కొత్తగూడెం పట్టణంలోని ఉర్దూఘర్‌లో సోమవారం జరిగింది. సభలో ప్రముఖ పాత్రికేయులు వేణుగోపాల్, జాతీయ నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, బెంగాలీ ఉద్యమ నాయకులు అమితాబ్, ప్రముఖ న్యాయవాది ఉపేందర్‌రావు మాట్లాడుతూ... భారత రాజ్యాంగాన్ని పాలకులు అవమానపరుస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఆసన్నమయిందన్నారు. కార్మిక చట్టాలతో న్యాయం జరగకుండా కోడ్‌లను రద్దు చేయడంపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నిర్మల, ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాస్, రాసుద్దీన్, జే.సీతారామయ్య, ఎల్ విశ్వనాథం, బి.రామ్ సింగ్, శ్రీధర్, ఎస్‌కే మదర్ పాల్గొన్నారు.

'ఉపాధి' సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ కూలీల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని న్యూడెమోక్రసీ అనుబంధ ఏఐకేఎంఎస్ నాయకుడు యాకయ్య, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని మామిడిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి కూలీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. రెక్కల కష్టం మీద ఆధారపడి జీవనం సాగించే కూలీలకు కూలి డబ్బులను సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.750 చెల్లించాలని కోరారు. ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లావణ్య, వరలక్ష్మి, రాంబాబు, బాయమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, రద్దు చేసిన కూలీల పని అలవెన్స్‌లను తిరిగి ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా నేత ఎట్టి నరసింహారావు, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రెండు సంఘాల జిల్లా కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా మండలంలోని దాసుతండాలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీల వద్ద సర్వే నిర్వహించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. కల్తి వెంకటేశ్వర్లు, రాండ్ల కోటిలింగం, వెంకన్న, నరేందర్, భిక్షం, చిన్నా, శ్రీను, సత్యవతి, లక్ష్మి, సీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి



చుంచుపల్లి: జెడ్పీ కార్యాలయంలో కొమరయ్య జయంతి వేడుకలో అధికారులు

చుంచుపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలను సోమవారం జెడ్పీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. జెడ్పీ సీఈఓ విద్యాలత కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. దొడ్డి కొమరయ్యను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, సిబ్బంది శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకలో ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం పాలకులపై తిరుగుబాటు చేసిన దొడ్డి కొమరయ్య జయంతిని సోమవారం జూలూరుపాడులో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లి లక్ష్మయ్య, గార్లపాటి వెంకటి, గార్లపాటి పవన్ కుమార్, రవి, పృథ్వీరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): భూసామ్య దోపిడీ వ్యవస్థకు పెద్దందారీ ఏకస్వామ్య పోకడలకు వ్యతిరేకంగా దొడ్డి కొమరయ్య చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. కొమరయ్య జయంతి సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ మేరకు పాషా మాట్లాడారు. కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రెడ్డి, కంచర్ల జమలయ్య, కే.రత్నకుమారి, మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, జర్పుల ఉపేందర్, పి.రాజు, సర్వేస్, సోమయ్య, బి.రవికుమార్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పొంచి ఉన్న ప్రమాదం



పట్టణంలో అక్కడక్కడ నడిరోడ్డు మీద ఉన్న మిషన్ భగీరథ మంచినీటి పైపులైన్ వాల్వ్‌లు ప్రమాదంగా మారాయి. ముఖ్యంగా మొయిన్ రోడ్ హైస్కూల్ వద్ద, ఇల్లెందులపాడు గాంధీ విగ్రహం వద్ద, చెరువు కట్ట ఆర్చీ వద్ద గల వాల్వ్‌లు రోడ్డు మీద ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారాయి. ఈ క్రమంలో వాహనాలు వాల్వ్‌లకు ఢీ కొడుతుండడంతో పైపులైన్‌లు పగిలిపోతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఇల్లెందు

ప్రశ్నించాల్సిన అధికారి : రామకృష్ణ, డీఈ మున్సిపల్, ఇల్లెందు
సెల్ నంబర్ : 9849254242